

విద్యార్థినిల హారం


తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా నవంబర్ 20వ తేదీగా ఏర్పడిన పాఠశాల విద్యార్థినిలు



హైదరాబాద్ వార్త

# దూకుడు పెంచిన పార్టీలు

**ప్రచారానికి ఇక 8 రోజులే మిగిలింది..**




ఓటర్లను ఆకర్షించేందుకు ప్రచారం హోరెత్తుతోంది. దీంతో గ్రేటర్‌లో రాజకీయం వేడెక్కింది. నేతలు మాటల తూటాలు వదులుతున్నారు. విమర్శలు ప్రతి విమర్శలతో గల్లీలన్నీ మార్మోగుతున్నాయి. గెలుపే లక్ష్యంగా ముఖ్య పార్టీల నేతలు ముందుకు కదులుతున్నారు. రాష్ట్రంలో ఈసారి ఎన్నికల్లో రాజధాని ప్రత్యేకత సంతరించుకుంది. అన్ని నియోజకవర్గాలలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులకు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ వ్యూహ ప్రతివ్యూహాలతో ప్రత్యర్థులపై మాటల దాడి చేస్తున్నారు. అభ్యర్థుల కుటుంబ సభ్యులు అంతా కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు. మరో ఎని మిది రోజుల్లో ఎన్నికల ప్రచారం ముగియనుండటంతో ఈలోపే ఓటర్లను ప్రసన్నం చేసుకో వడానికి ప్రధాన పార్టీలు ఎత్తులు పైఎత్తులు వేస్తున్నాయి. అభ్యర్థులు ఉదయం ఇంటింటి ప్రచారం చేస్తూ మధ్యాహ్నం కార్యకర్తలతో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇక ప్రధాన పార్టీలు భారీ బహిరంగసభలు ఏర్పాటు చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

**మాటల తూటాలు!**

**సై అంటే సై అంటున్న బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపిలు**

**వ్యూహాలకు పదును పెడుతున్న ప్రధాన పార్టీలు**



హైదరాబాద్, నవంబరు 20 ప్రభాతవార్త : ప్రజల్లో విస్తృతంగా పర్యటిస్తున్న అభ్యర్థులు తమ గెలుపునకు కలిసొచ్చే ఏ అంశాన్నీ విడిచిపెట్టకుండా సమీక్షిస్తున్నారు. ప్రచారానికి ఎనిమిది రోజుల సమయమే ఉండడంతో అనుచరులతో నిత్యం వ్యూహ, ప్రతివ్యూహాలపై చర్చిస్తున్నారు. ఏ బస్తీ, ఏ కాలనీ, ఏ మున్సిపల్ డివిజన్‌లో ఎక్కువ ఓట్లు వస్తాయి. ఎక్కడ తక్కువగా పోల్ అవుతాయనే లెక్కలు వేసుకుంటున్నారు. బలం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఓట్లను కొల్లగొట్టేందుకు ఏ నాయకుడిని తమ వైపు తిప్పుకోవాలి, అక్కడ ప్రచారం ఎలా చేయాలనే అంశంపై చర్చిస్తూ ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి బలం, బలహీనతలపై కూడా దృష్టి సారిస్తున్నారు. దాదాపు అన్ని నియోజవర్గాలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి మధ్యే పోటీ ఉన్నట్లు తెలుస్తుండగా, పాతబస్తీలో మాత్రం ఎంఐఎం–కాంగ్రెస్–బిజెపి మధ్యే పోటీ కనిపిస్తోంది. దీంతో అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా హోరాహోరీగా పోరాడుతున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నారు. ప్రచారానికి మిగిలిన సమయాన్ని వృథాచేయకుండా ప్రజల్లోకి వెళ్తున్నారు. అలాగే గెలుపోటములను ప్రభావితం చేయగలిగిన నాయకులు, కార్యకర్తలతో టచ్‌లో ఉంటూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుల బలాబలాలపై ఆరా తీస్తూ ఎలక్షన్ మేనేజ్‌మెంట్‌పై మంతనాలు జోరుగా సాగిస్తున్నారు. అభ్యర్థులు ప్రధానంగా ఎన్నికల మంత్రాంగంపై దృష్టిసారించారు. పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్ది ఏ పోలింగ్ స్టేషన్‌లో ఎన్ని ఓట్లు ఉంటాయి. అక్కడ ఏజెంట్లుగా ఎవరిని నియమించాలనే అంశంపై ఆరా తీస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రధాన అనుచరులతో క్షేత్రస్థాయిలో పరిస్థితులను బేరీజు వేస్తూ అందుకు అనుగుణంగా నిర్ణయాలను తీసుకుంటున్నారు. ఓటర్లను ప్రభావితం చేయగలిగే నాయకులకే బాధ్యతలు అప్పగిస్తూ రోజూ పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. తాము గెలిస్తే చేసే పనులను ఆయా నాయకులకు వివరించి ఓటర్లకు చేరవేసేలా దిశానిర్దేశం చేస్తున్నారు.

## కమలం గుర్తుకు ఓటేయండి.. కెసిఆర్ అవినీతి పాలనను అంతం చేయండి

**రాజేంద్రనగర్ బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి * జోరుగా కొనసాగుతున్న ప్రచారం**



ఆరాంఘర్ ప్రాంతంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న రాజేంద్రనగర్ బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి

నార్సింగి, నవంబర్ 20 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలంతా కమలం గుర్తుకు ఓటేయండి... కేసీఆర్ అవినీతి పాలనను అంతం చేయండి అని బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరాంఘర్, అత్తాపూర్, మైలార్‌దేవుపల్లి, గండిపేట్ మండలంలో జోరుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ, కమలం గుర్తును ఓటర్లకు చూపిస్తూ తనకే ఓట్లు వేసి, ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 15.ఏళ్లుగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా పని చేసిన నేతకు ఎన్ని నిధులు వచ్చాయో? ఎక్కడి నుంచి అదనపు నిధులు తీసుకురావాలో తెలియదని పేర్కొన్నారు. సర్కారు భూములు చెరబట్టి స్వాహా చేయడం తప్పా అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో ధ్యాస పెట్టడం లేదన్నారు. అధికార పార్టీకి చెందిన ఇతర ప్రాంత ఎమ్మెల్యేలు వందల కోట్ల నిధులను తరలించుకెళ్లి హైదరాబాద్ మహానగరానికి ధీటుగా అభివృద్ధి చేసుకుంటున్నారని, మన ఎమ్మెల్యే మాత్రం తన కోటా నిదులను కూడా ఖర్చు చేయలేకపోతున్నాడని విమర్శించారు. వయోజనులు, మహిళలు, కార్మికులు, యువకులు, ఉద్యోగులు, నిరుద్యోగులు అందరూ ఆలోచించాలని, తన కోటా నిధులు కూడా ఖర్చు చేయని ఎమ్మెల్యే మనకు అవసరమా? చర్చించుకొని ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. రెండుమార్లు అధికార పార్టీ ఎమ్మెల్యే ఎత్తులకు పై ఎత్తులు వేసి మైలార్‌దేవుపల్లిలో కార్పొరేటర్‌గా విజయం సాధించానని, ఈ సారి ప్రజలంతా ఆశీర్వదించి ఆయనపై నన్ను గెలిపించాలని కోరారు. ఒక్కసారి నాకు అవకాశం ఇస్తే... నా పనితనం ఏమిటో, ఎమ్మెల్యే కోటాతో పాటు అదనపు నిధులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఎలా తీసుకురావాలో తెచ్చి అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. నేను ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోడీ వంటి సమర్థవంతమైన, అవినీతి రహిత పాలన కోసం రాజేంద్రనగర్‌లో బిజెపిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముఖ్యంగా యువత స్వచ్ఛందంగా నా ప్రచారంలో పాల్గొంటుండడం, కాషాయ జెండాలను భుజాలపై మోస్తూ, జైశ్రీరాం... జైజై శ్రీరాం... భారత్‌మాతాకి జై... నరేంద్రమోడీ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ చేస్తున్న నినాదాలు పార్టీ క్యాడర్‌లో, నాలో నూతనోత్తేజాన్ని ఇస్తుందని బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## బిసిలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**ప్రధాని మోదీకి, ఎఐసిసి నేత సోనియాగాంధీకి బహిరంగ లేఖలు**

**రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య**

సైఫాబాద్, నవంబరు 20 ప్రభాతవార్త: జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపి పార్టీలు తమ, తమ ఎన్నికల మ్యానిఫెస్టోల్లో పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టి చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామనే అంశాన్ని చేర్చకపోవడం అన్యాయమని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. చట్ట సభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని దశాబ్దాలుగా బిసిలు ఉద్యమిస్తున్నారని, ఇది దేశంలోని 50 కోట్ల మంది చిరకాల కోరికని చెప్పారు. ఇప్పటికైనా ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచాలని ప్రధాని నరేంద్రమోదీ, ఎఐసిసి నేత సోనియాగాంధీకి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేస్తూ సోమవారం బహిరంగ లేఖ రాయడం జరిగింది. బిజెపి బిసిలకు ముఖ్యమంత్రి పదవిని ప్రకటించడం బిసిల ఉద్యమంలో ఒక భాగమని, మరొక భాగం బిసిలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు సాధించడమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒకడుగు ముందుకేసి బిసి కులాల వారి లెక్కలు తీసి జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్‌లు పెంచుతామని ప్రకటించిందని, అలాగే స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్‌లు పెంచుతామని, క్రీమిలేయర్‌ను తొలగిస్తామని ప్రకటించిందని ఇది బిసిల విజయమని కాని ఏ పార్టీ కూడా బిసిలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వడానికి సిద్ధపడటం లేదని ఆయన ఆరోపించారు. రాజ్యాధికారంలో వాటా కల్పించేంతవరకు బిసి ఉద్యమం కొనసాగుతుందని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బిఆర్ఎస్ పార్టీ బిసిల అభివృద్ధిపై విధాన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కులాల వారిగా జనాభా లెక్కలు, చట్ట సభలలో రిజర్వేషన్‌లు, విద్యా, ఉద్యోగాలలో జనాభా ప్రకారం రిజర్వేషన్‌ల అంశంపై విధాన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలు బిసి బిల్లుకు మద్దతు తెలిపితే ఆ పార్టీకే బిసిల మద్దతు ప్రకటిస్తామని ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు.

## తాను మరణిస్తూ.. నలుగురికి ప్రాణదానం చేశాడు

**బ్రెయిన్ డెడ్ వ్యక్తి అవయవాలను దానం చేసిన కుటుంబీకులు**



బెయిన్ డెడ్‌తో మరణించి అవయవదానం చేసిన శ్రీనివాస్ (ఫైల్‌ఫోటో)

గచ్చిబౌలి, నవంబరు 20 ప్రభాతవార్త : తాను చనిపోతూ మరో నలుగురికి ప్రాణదానం చేశాడు శేరిలింగంపల్లికి చెందిన వ్యక్తి. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసేందుకు ముందుకు రాగా, డాక్టర్లు సదరు అవయవాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న మరో నలుగురికి ప్రాణం పోశారు. శేరిలింగంపల్లికి చెందిన శ్రీపతి శ్రీనివాస్(48) శేరిలింగంపల్లి ప్రాంతం లో పని చేస్తున్నాడు. కాగా గత ఐదు రోజుల క్రితం శ్రీనివాస్‌కు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా, డాక్టర్లు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. ఐదు రోజుల పాటు మ ృత్యువుతో పోరాడిన శ్రీనివాస్ సోమవారం తుదిశ్వాస విడిచాడు. దీంతో కుటుంబ సభ్యులు శ్రీనివాస్ అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. కిమ్స్ ఆసుపత్రిలో శ్రీనివాస్ గుండె, కాలేయం, రెండు కిడ్నీలను డాక్టర్లు అత్యవసరం ఉన్న ఇతర రోగులకు అమర్చేందుకు ఆపరేషన్ చేశారు. తాను చనిపోతూ మరో నలుగురికి ప్రాణదానం చేసిన శ్రీనివాస్‌ను స్థానికులు స్మరించుకున్నారు. అనంతరం శ్రీనివాస్ భౌతికఖాయాన్ని అంత్యక్రియల నిమిత్తం తన సొంత గ్రామం కరీంనగర్‌కు తరలించారు.

### అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

పేట్‌బషీరాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త : 129 సూరారం డివిజన్ పరిధి న్యూ షాపూర్‌నగర్‌లో ఆదివారం సాయంత్రం కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చేరికల కార్యక్రమంలో వంశీ వారి మిత్రబృందంలోని దాదాపు 1000 మంది ఎమ్మెల్యే కెపి వివేకానంద అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. వంశీ, శ్రీనివాస్, చిన్న, ఆంజనేయులతో పాటు 1000మంది పార్టీలో చేరారు.





సమావేశంలో మాట్లాడుతున్న తలసాని

## తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**

సంజీవరెడ్డి నగర్, నవంబర్ 20, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో అన్ని వార్గల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం రాత్రి అమీర్‌పేటలోని మున్సిపల్ గ్రౌండ్‌లో ఉత్తర భారతీయు ప్రవాసీ సేవా సంఘ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీపావళి స్నేహ సమ్మేళనలో తలసాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ మినీ ఇండియాగా పిలుచుకునే హైదరాబాద్‌లో వివిధ భాషలు, వివిధ ప్రాంతాలకు చెందిన వారు నివసిస్తున్నారని చెప్పారు. ఇక్కడ నివసించే వారంతా తెలంగాణ బిడ్డలేనని, వారిని తమ ప్రభుత్వం కడుపులో పెట్టుకొని చూస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత హైదరాబాద్ నగరం ఎంతో అభివృద్ధి చెందిందని, దేశంలోని ముఖ్య నగరాలలో హైదరాబాద్ ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో దేశంలోని ప్రథమస్థానంలో ఉన్నామని, దేశంలోనే అత్యధిక సిసి కెమెరాల ఏర్పాటు చేసిన నగరం కూడా హైదరాబాద్ అన్నారు. భాష, ప్రాంతం ఏదైనా కెసిఆర్ ప్రభుత్వం వారి అభివృద్ధికి అన్ని విధాలా చేయూతను అందిస్తుందన్నారు. జైన్ సమాజ్ భవనం నిర్మాణం కోసం ఉప్పల్ భగాయత్‌లో 2 ఎకరాల భూమి కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. మహావీర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి లీజుకు ఇచ్చిన కోట్లాది రూపాయల విలువైన హాస్పిటల్ స్థలాన్ని ఉచితంగా కేటాయించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ తలసాని సాయికిరణ్‌యాదవ్, మాజీ కార్పోరేటర్ నామన శేషుకుమారి, అగర్వాల్ సమాజ్ అధ్యక్షులు మనీష్ అగర్వాల్, జైన్ సమాజ్ అధ్యక్షుడు హన్స్‌రాజ్‌కోఠారి, హిమాన్షు బాప్నా, గులాబ్ సింగ్, ఉత్తమ సింగ్, చైన్ సింగ్, పియూష్‌గుప్తా, మహేశ్వరి సమాజ్, బెంగలీ సమాజ్, బాలాజీ రాజస్థాన్ సమాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వం

**శేరిలింగంపల్లి అభ్యర్థి అరెకపూడి గాంధీ**

**ప్రచారంలో మంగళహారతులతో స్వాగతం పలికిన మహిళలు**






బిఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను మహిళలకు వివరిస్తున్న శేరిలింగంపల్లి అభ్యర్థి ఆరెకపూడి గాంధీ

సైబరాబాద్ ప్రతినిధి, నవంబరు 20 ప్రభాతవార్త : మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, మహిళా సాధికారత కోసం చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ అన్నారు. మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను తీసుకువచ్చి వారు స్వశక్తితో జీవించే విధంగా ముఖ్యమంత్రి కృషి చేశారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం లో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హైదర్‌నగర్, రాంనరేష్ నగర్, నందమూరి నగర్, జయభారత్‌నగర్, నిజాంపేట రోడ్డు, సెవెన్ హిల్స్, అల్లాపూర్ సొసైటీ తదితర ప్రాంతాల్లో బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. అంతకుముందు స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి దుర్గా మైసమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించడంతో పాటు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాదాపూర్ డివిజన్ పరిధిలో డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఖానామెట్‌కు చెందిన బిజెపి రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ జంగయ్యయాదవ్, అతని అనుచరులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై పార్టీలో చేరిన వారిని బిఆర్ఎస్ కండువాలతో ఆహ్వానించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన గాంధీకి స్థానిక మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా అరెకపూడి గాంధీ మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు జరుగుతుందన్నారు. మహిళలకు ప్రసూతి సమయంలో కెసిఆర్ కిట్‌లను అందజేయడంతో పాటు నగదు ప్రోత్సాహకం అందించడం, బాలికల విద్య కోసం ప్రభుత్వ గురుకుల పాఠశాలలను ఆధునీకరించి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాళభైరవ్ హనుమాన్ మందిరంలో పూజలు



కాళభైరవ్ హనుమాన్ మందిరంలో జరిగిన అన్న ప్రసాదం కార్యక్రమంలో పాల్గొన్న చార్మినార్ ఏసిపి రుద్రభాస్కర్

చార్మినార్, నవంబరు 20 ప్రభాతవార్త : కార్తీక మాసం సందర్భంగా పాతబస్తీ హుస్సేనీఆలం శ్రీ కాళభైరవ్ హనుమాన్ మందిరంలో అన్న కూట్ ప్రసాదం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న చార్మినార్ ఏసిపి రుద్రభాస్కర్‌ను మందిరం కమిటి సభ్యులు శాలువ కప్పి సన్మానించారు. బిజెపి నాయకులు టి.ఉమామహేంద్ర, కె.సురేందర్, రంజిత్ సింగ్ ఠాకూర్, మందిరం కమిటి ప్రతినిధి ఫంకజ్ అగర్వాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ మూసీ నది కొత్త బ్రిడ్జిల నిర్మాణంపై మొదలైన చర్చ

**గత ఎన్నికల్లో నాయకులు హామీ ఇచ్చినా మొదలుకాని పనులు ■ నిత్యం ట్రాఫిక్ రద్దీతో అనేకచోట్ల వాహనదారుల అగచాట్లు**

**రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ మూసీ నదిపై పలుచోట్ల కొత్తగా బ్రిడ్జిలను నిర్మించే అంశం మరోసారి చర్చకు రాసాగింది. గత ఎన్నికల సమయంలో అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష నాయకులు ఈ అంశానికి ప్రాధాన్యత ఇవ్వగా ఎన్నికలు ముగిశాక దీని గురించి అందరు మరచిపోయారు. ఇప్పుడు మరోసారి ఎన్ని కలు రావడంతో ఈ అంశంపై ఆయా ప్రాంతాల ప్రజలు నాయకులకు ఓవైపు గుర్తు చేస్తూనే మరోవైపు నిలదీ యసాగారు. నాయకుల హామీ ఎలా వున్నా మూసీ నదిపై పలుచోట్ల కొత్త బ్రిడ్జిల నిర్మాణంపై సర్కారు కూడా ప్రకటన చేసినా పనులే ఇంతవరకు మొదలుకాలేదు. దీనివల్ల ఆయా ప్రాంతాల ప్రజలతో పా టు వాహనదా రులు నిత్యం ట్రాఫిక్ సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారు.**

హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త: హైదరాబాద్ మహా నగర ట్రాఫిక్ సంగతి అందరికి తెలిసిందే. జంట నగరాలు అంతకంతకూ విస్తరిస్తుండడం, ఎక్కడికక్కడ కొత్త కాలనీలు ఏర్పాటవుతుండడంతో అంతటా ట్రాఫిక్ సమస్యలు ఎక్కువవుతుండం విదితమే. ఈ క్రమంలోనే నగరంలోని అనేకచోట్ల కొత్త రహదారులు, అప్రోచ్ రోడ్ల ఏర్పాటు జరుగుతున్నా కీలకమైన మూసీ నదికి ఇరువైపులా ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం దొరకడం లేదు. నగరం మధ్య నుంచి వెళుతున్న మూసీ నదిపై పలు చోట్ల చాలా కాలం నిర్మించిన బ్రిడ్జిలు ఇప్పటి అవసరాలను ఏ మాత్రం తీర్చలేక పోతున్నాయి. ఈ కారణంగా మూసి నదిపై అనేకచోట్ల రహదారులు విస్తీర్ణంగా వున్నా నది వద్దకు వచ్చేసరికి ఇరుకుగా వున్న బ్రిడ్జిల వద్ద వాహనదారులు వెళ్లడమే గగనమవుతోంది. ఇది ఏ ఒక్కచోట వున్న సమస్యకాదు, అనేకచోట్ల వున్నా దీనిని పరిష్కరించేందుకు సర్కారీ విభాగాలు ఇంత వరకు ఎ లాంటి ఆచరణాత్మక చర్యలు తీసుకోక పోవడం వాహనదారుల పాలిట శాపంగా మారింది. ఈ అంశం రాష్ట్రంలో ఎన్నికలు జరిగే ప్రతీసారి, బల్దియా ఎన్నికల వేళ ప్రజల్లో చర్చకు వస్తోంది. మూసీ నదిపై రద్దీగా వున్న ప్రాంతాలను పరిశీలిస్తే మొహదీపట్నం నుంచి రాజేంద్రనగర్ వైపు వెళ్లే మార్గంలో అత్తాపూర్ వద్ద మూసీ నదిపై వున్న బ్రిడ్జి 1980 దశకంలో ఇన్నర్ రింగు రోడ్డు ఏర్పాటు చేసిన సమయంలో నిర్మించారు. అప్పట్లో రెండు వైపులా వాహనాలు వెళ్లేందుకు నాలుగులేన్ల రోడ్డు వుండేలా బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈ ప్రాంతంలో మూసీ నదికి ఇరువైపులా ఎనిమిది లేన్ల వరకు రహదారులు ఏర్పాటయ్యాయి. ఇదే సమయంలో అత్తాపూర్‌తో పాటు మొహదీపట్నం మార్గంలో లంగర్‌హౌజ్ ప్రాంతంలో పెద్ద ఎత్తున వ్యాపార కేంద్రాలు ఏర్పాటయ్యాయి. దీంతో ఈ ప్రాంతంలో నిత్యం వాహనాల రద్దీ విపరీతంగా వుంటోంది. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు వాహనాల రద్దీ భారీగా వుంటోంది. ఇక బ్రిడ్జికి రెండు వైపులా కృష్ణా పైపు లైన్లు వున్నాయి. దీంతో బ్రిడ్జి విస్తరణ ఇదే ప్రాంతంలో సాధ్యం కాదు. అయితే దీనికి పక్కన విస్తరణ అయ్యే వీలుంది. ఉప్పల్, ఎల్‌బి నగర్‌లో సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లోనే పాత బ్రిడ్జికి ఇరువైపులా కొత్త బ్రిడ్జిలను ఏర్పాటు చేశారు. దీనివల్ల ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ తకు ్కవయ్యింది. అయితే అత్తాపూర్–మొహదీపట్నం మార్గంలో మూసీ నదిపై ఉప్పల్, ఎల్‌బి నగర్ మార్గంలో నిర్మించినట్లు కొత్త బ్రిడ్జిలు నెలకొల్పితే ఇక్కడ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించే వీలుంది. దీనిపై గత ఎన్నికల వేళ ఈ ప్రాంతం నుంచి పోటీచేసిన అన్ని పార్టీల నాయకులు ప్రజలకు హామీ ఇచ్చినా ఇది ఇప్పటి వరకు ఆచరణకు నోచుకోలేదు. దీని తరువాత పురానాపూల్, చాదర్‌ఘాట్, అఫ్జల్‌గం జ్‌ల వద్ద మూసీ నది పై వున్న బ్రిడ్జిల వద్ద కూడా కొత్త వాటిని నిర్మించే అంశంపైనా గత ఎన్నికల సమయంలో ఆ తరువాత జరిగిన బల్దియా ఎన్నికల వేళ ఆయా పార్టీల నాయకులు హామీలు గుప్పించారు. అయితే ఇది కూడా అమలుకు నోచుకోలేదు. ఈ ప్రాంతాలలో కొత్త బ్రిడ్జిలను నిర్మించాలని ట్రాఫిక్ పోలీసులు నివేదిక అందజే యడం, ఆ తరువాత సర్కారు కూడా ఒకే అనడం జరిగినా పనులు మాత్రం మొదలు కాలేదు. అత్తాపూర్, మొహదీపట్నంతో పోలిస్తే పురానాపూల్, అఫ్జల్‌గంజ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్య మరింతగా వుంది. పాతబస్తీ నుంచి హైదరాబాద్‌లోని ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వున్న ఈ బ్రిడ్జిలు ఇప్పుడున్న ట్రాఫిక్ రద్దీని తట్టుకోలేక పో తున్నాయి. పురానాపూల్ వద్ద నిజాం నవాబుల కాలంలో వందేళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జికి పక్కనే కొత్త బ్రిడ్జి ఏర్పాటైనా ఇది కూడా ఇక్కడి వాహనాల రద్దీని తట్టుకోలేక పోతోంది. ఇక దీని తరువాత సిటీ కాలేజి వద్ద ముస్లింగ్ జంగ్ పూల్ బ్రిడ్జి కూడా ఇదే విధంగా ట్రాఫిక్ రద్దీని ఎదుర్కొంటోంది. ఇక్కడ నిజాం కాలంలో వున్న బ్రిడ్జి సేవలను ఇంకా వాడుకుంటుండడం ఒక ఎత్తయితే రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన కొత్త బ్రిడ్జిలలో ఒకటి నిర్మాణ లోపం వల్ల కూలిపోయే దశలో వుండడంతో దీనిని వాడడం లేదు. ఇక ఇదే మార్గంలో మదీనా వద్ద వున్న మరో రెండు బ్రిడ్జిలు కూడా వాహనాల రద్దీని తట్టుకోలేక పోతున్నాయి. ఈ ప్రాంతంలో మరో వంతెనను ఏర్పాటు చేయాలని ప్రజలు చాలాకాలంగా కోరుతున్నారు. దీంతో పాటు సిటీ కాలేజి నుంచి మదీనా వరకు మూసీ నదిలో పిల్లర్లు ఏర్పాటు చేసి ఈ మార్గంలో హైకోర్టు వె నుక భాగంలో ఇరుకుగా వున్న రహదారిని కూడా విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు. మదీనా తరువాత వున్న చాదర్‌ఘాట్ వద్ద గల బ్రిడ్జి పాతబడి పోయింది. ఈ మార్గంలో కాజ్‌వేను నిర్మించినా ఇది కూడా వాహనాల రద్దీని తట్టుకోలేక పోతోంది. ఈ మార్గంలో మరో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి సర్కారు అంగీకరించినా పను లు మొదలు కాలేదు. దీని తరువాత మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై వున్న కాజ్ వే మూసీకి చిన్నపాటి వరద వచ్చినా మునిగిపోతోంది. దీంతో ఈ మార్గంలో వెళ్లాల్సిన వారు గోల్‌నాక వద్ద వున్న బ్రిడ్జి మీదుగా సుదూర దూరం నుంచి వెళ్లాల్సి వుంటుంది. ఈ ప్రాంతంలో కొత్త బ్రిడ్జి ఏర్పాటుకు ముహూర్తం కూడా కుదిరినా దీ నికి సంబంధించిన పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియకుండా వుంది. మామూలుగా అయితే మూసీ నదిపై కొత్త బ్రిడ్జిల అంశం సాధారణమే అయినా ఎన్నికల వేళ ఆయా ప్రాంతాల ప్రజలు దీనిపై నాయకులకు గుర్తు చేయడం, నిలదీయడం చేస్తుండడంతో మరోసారి ఇది వార్తల్లో నిలిచింది..

# రాజేంద్రనగర్‌లో సబ్బండ వర్గాల మద్దతు బిఆర్ఎస్‌కే : ప్రకాశ్‌గౌడ్

**మణికొండ, చిత్రపురి కాలనీల్లో జోరుగా ప్రచారం.. అడుగడుగునా జన నీరాజనం**



మణికొండలో రోడ్‌షోలో పాల్గొన్న రాజేంద్రనగర్ బిఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, నవంబర్ 20 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో సబ్బండ వర్గాల మద్దతు బిఆర్ఎస్‌కే ఉందని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం గండిపేట మండలంలోని మణికొండ మున్సిపాలిటీ, చిత్రపురి కాలనీల్లో ఎమ్మెల్యే భారీ రోడ్‌షో నిర్వహించారు. అనంతరం మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్ వల్లభనేని హైమాంజలి అనిల్‌లతో కలిసి కారు గుర్తుకే ఓట్లు వేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారం ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంత వరకు అడుగడుగునా జన నీరాజనమే కనిపించింది. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ముదిరాజ్‌లకు చేపలు, గొల్లలకు గొర్రెలు, బిసిలకు బర్రెలు, చాకలిలకు ఉచితంగా కరెంటు సరఫరా, రైతులకు 24.గంటల నాణ్యమైన కరెంటు, రైతు భీమా, రైతు బంధు, వికలాంగులకు, వితంతువులకు ఆసరా పించన్లు, యువతకులకు కళ్యాణలక్ష్మి కింద రూ.లక్షా 116, నవజాత శిశువులకు కేసీఆర్ కిట్లు, మహిళల ఇబ్బందులను దూరం చేసేందుకు కుళాయిల ద్వారా సురక్షిత మంచినీటి సరఫరా వంటి అనేక సంక్షేమ పతకాలను దేశంలోనే సమర్థవంతంగా అమలు చేస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం పై పూర్తి పట్టున్న, అవగాహన ఉన్న నాయకుడు కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చూడాలని రాష్ట్ర ప్రజలంతా డిసైడ్ అయ్యారన్నారు. ప్రతిపక్షాలు ఏనాడు ప్రజల కోసం ఉద్యమించలేదని, ఇప్పుడు వచ్చి పని చేసే సీఎం కేసీఆర్‌పై, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అసత్య ఆరోపణలు చేస్తూ ఓట్లు అడిగితే ఎలా నమ్ముతారన్నారు. పని చేసే వారికే పట్టం కడితే, అవకాశం ఇస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. అలవికాని హామీలిచ్చి ఓట్లను దండుకోవాలని కాంగ్రెస్ పార్టీ చూస్తుందని, ఒక్క అవకాశం కావాలని ఇప్పుడు అడుగుతుండడం సిగ్గుచేటని, ఇప్పటి వరకు 11.సార్లు అవకాశం ఇచ్చిన ఏమీ చేయలేదని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్, బిజెపిలకు ఓట్లు వేస్తే అవి మురిగిపోతాయని, బిఆర్ఎస్‌కు ఓట్లేస్తేనే.. ప్రజల బాధలు తీర్చే, రాష్ట్రంను అభివృద్ధి చేసే కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడుతుందని ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు.

# కూకట్‌పల్లి నియోజకవర్గం కెసిఆర్‌ని గద్దె దించే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ : బండి రమేష్



ప్రచారంలో పాల్గొన్న బండి రమేష్

మూసాపేట, నవంబర్ 20, ప్రభాతవార్త : మూసాపేట్ డివిజన్ అభిబ్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి బండి రమేష్ నియోజకవర్గం కో ఆర్డినేటర్ డాక్టర్ సత్యం శ్రీరంగంతో కలిసి ప్రారంభించారు. మూసాపేట్, ఫతేనగర్ డివిజన్ కాలనీలో పాదయాత్ర చేస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆరు గ్యారంటీల పథకాలను వివరించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ స్థానిక నాయకులపై ప్రజలు దుమ్మెత్తిపోశారు. పెన్షన్ ఇవ్వడం లేదని, ఇండ్లు ఇవ్వడంలేదని ఏ పథకం కూడా మాకు అందట్లేదని, మా ఓట్లతో గెలిచి గద్దెక్కి కూర్చుని మమ్మలను మా బాధలను వినే నాథుడు లేడని బండి రమేష్‌కు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులారా ఈ ప్రజలను మోసం చేసి ఎన్ని రోజులు గద్దెమీద కూర్చుంటారు. ప్రజలను మర్చిపోయి ఖాళీ భూముల వేటలో ఉండి కబ్జాలకు ప్రణాళిక వేసుకుంటున్నారా.. ఇంక మీ ఆటలు సాగవ్, మీకు నూకలు చెల్లాయి అన్నారు. మీకు నేను ఉన్నాను, మీకు ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. మీకు మరో పిజెఆర్‌ను అవుతానని అన్నారు. నా రాజకీయ ఆలోచన ప్రస్తావన పిజెఆర్‌తోనే మొదలయ్యిందని అన్నారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు కృష్ణరాజ్‌పుత్, రమేస్, నర్సింహా, మహిళా అధ్యక్షురాలు భారతమ్మ, రమాదేవి, కనకయ్య, శ్రీనివాస్, చారి పాల్గొన్నారు.

# ప్రస్తుత సమాజంలో విధ్యార్థులకు సాంకేతిక విజ్ఞానం ఎంతో వసరం

**ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్**



ప్రతిభకల్గిన విధ్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రభుత్వ ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్

నాచారం, నవంబర్ 20 ప్రభాతవార్త: ప్రస్తుత సమాజంలో విధ్యార్థులకు సాంకేతిక విజ్ఞానం ఎంతో వసరమని ప్రభుత్వ ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ పేర్కొన్నారు. పల్లవి మోడల్ స్కూల్‌లో డిజిజ్ఞాన్ గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ విధ్యార్థినుల కోసం కంప్యూటర్ ఉపయోగాల గురించి శిక్షణ నివ్వడం ఎంతో గొప్పవిషయం అన్నారు. అందుకు యువ ఆవిష్కరణలైన మానసరెడ్డి, నఫీజా అంజు,పల్లవి మోడల్ స్కూల్ యాజమాన్యం కృషి అభినందనీయం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విధ్యార్థులకు ఇలాంటి శిక్షణ ఇవ్వడం అవసరం అన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థినులు మాట్లాడుతూ డిజిజ్ఞాన్ తరగతులతో సైబర్ నేరాలను అరికట్టడం, ఎంఎస్ ఆఫీస్ ఉపయోగాలపై శిక్షణను పొందామన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉత్తమ ప్రతిభకనబరిచిన విధ్యార్థులకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో విహాబ్ సిఇఓ దీప్తి రావు, కోఆర్డినేటర్ తాజ్, పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ కొమురయ్య, అకాడమి చైర్మన్ డా.సుధ, డైరెక్టర్ సుశీల్ కుమార్, ప్రిన్సిపల్ తనుజతో పాటు పలువురు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు బెయిల్.. ఫిల్మ్‌నగర్‌లో సంబరాలు


ఫిల్మ్‌నగర్, నవంబర్ 20, ప్రభాతవార్త : హైకోర్టులో చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ లభించడంతో జూబ్లీహిల్స్ డివిజన్ టిడిపి శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఫిల్మ్‌నగర్ చౌరస్తాలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సైకో సీఎం పోవాలి, టిడిపి అధికారంలోకి రావాలి, చంద్రబాబు సీఎం కావాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు సలీం, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి మల్యాపతి, భవాని, విజయలక్ష్మీ, పి.యాదగిరి, కె.యాదయ్య, ఉపాధ్యక్షులు బెంజిమెన్, రాధాకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న పార్టీ శ్రేణులు

# కాసాని చేరికతో కుత్బుల్లాపూర్‌లో తిరుగులేని శక్తిగా బిఆర్ఎస్

**విద్యావంతుడు ఎమ్మెల్యే అభ్యర్థి వివేకానంద గెలుపు ఖాయం : జ్ఞానేశ్వర్ ముదిరాజ్**



జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

జీడిమెట్ల, నవంబర్ 20, ప్రభాతవార్త : బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాసాని జ్ఞానేశ్వర్ సన్మానసభ కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీలో ఇటీవల చేరిన సీనియర్ నాయకులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ హాజరవగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కెపి వివేకానంద, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి పార్టీ తెలంగాణ అధ్యక్ష పదవికి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరడం, బిఆర్ఎస్ పార్టీకి మరింత బలాన్ని చేకూర్చిందన్నారు. వారి రాజకీయ అనుభవంతో రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో అగ్రపథాన నిలుపుతామన్నారు. సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ చేరికతో తెలంగాణలో బిఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. అనంతరం జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ సీఎం కెసిఆర్ గత తొమ్మిదేళ్ళకాలంలో తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం నేడు దేశానికి దిక్సూచిగా మారాయన్నారు. రాష్ట్రంలోనే అన్ని కులాల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలతో రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆర్థికంగా బలోపేతమయ్యారన్నారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్‌లో అందరికీ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి కోసం పరితపించే నాయకుడు, విద్యావంతుడు, యువకుడు కెపి వివేకానంద ముచ్చటగా మూడవసారి ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమన్నారు. తదనంతరం చింతల్ ఎమ్మెల్యే కార్యాలయం నుంచి 200మంది బైక్ ర్యాలీ నిర్వహించి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సన్మానసభకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి చినంగి వెంకటేశం ముదిరాజ్, మున్సిపల్ చైర్మన్లు, కార్పోరేటర్లు, కౌన్సిలర్లు, యువజన నాయకులు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల తాయిలాలు షురూ

**ఓటర్లును మచ్చిక చేసుకోవడానికి పార్టీలు పాట్లు**

**రాత్రికి రాత్రే వెలుస్తున్న రోడ్లు**

**ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా భయం లేని వైనం**

అల్వాల్, నవంబరు 20 ప్రభాతవార్త: ఎన్నికల తాయిలాలకు పార్టీలు వేగం పెంచాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలోనే సీసీ రోడ్లు వెలుస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఓ ప్రధాన రాజకీయ పార్టీ కాలనీ, బస్తీ వాసుల కోరికలను తీర్చుతూ దూసుకు పోతోంది. రోడ్లు, సీసీ కెమెరాలు, పార్కులులో ఆట వస్తువులు, వీది దీపాలు, యువతకు క్రీడా సామగ్రి ఇలా ఓటర్లును తమ వైపు తిప్పు కోవడానికి పార్టీలు నానా ప్రయాసలు పడుతున్నాయి. మల్కాజిగిరి నియోజవర్గం పరిధిలోని అల్వాల్‌లో ఈ తంతు వేగంగా సాగుతోంది. నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకుని ఉన్న నేపథ్యంలో పార్టీలు ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపిలు నువ్వా నేనా అన్నట్లు పోటీ పడుతున్నాయి. కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి, బిఆర్ఎస్ నుంచి మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి, బిజెపి నుంచి రామచంద్రరావు పోటీలో ఉన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లికి మూడు దశాబ్ధాలుగా రాజకీయ అనుభవం ఉంది. మర్రి రాజశేఖర్ రెడ్డి గత పార్లమెంటు ఎన్నికలులో పోటీ చేసి ఓడి పోయారు. మంత్రి మల్లారెడ్డితో పాటుగా అధిష్టానం స్థానిక క్యాడర్ ఆయనకు అండదండలు అందిస్తున్నాయి. ఇక రామచంద్రరావుకు సుధీర్ఘమైన రాజకీయ చరిత్ర ఉంది. రెండు పర్యాయాలు మాల్కాజిగిరి నుంచి పోటీ చేయడంతో పాటుగా ఎమ్మెల్సీగా పని చేశారు. మూడు పార్టీలు ఎన్నికల క్షేత్రంలో దూసుకు పోతున్నాయి. ఓల్డ్అల్వాల్ లయోలా కళాశాల రోడ్డు వద్ద ఉన్న ఓ కాలనీ వాసులు కోరికి మేరకు సీసీ రోడ్డు ఇటీవల వెలసింది. జిహెచ్ఎంసి పరంగా రోడ్డు నిర్మాణానికి సాంక్షన్ ఉంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులను అధికారులు చేపట్టలేదు. ఇటీవల ఓ రాజకీయ పార్టీకి చెందిన నేత సదురు కాలనీకి ఎన్నికల ప్రచారం నిమిత్తం వచ్చారు. కాలనీ వాసులు కోరిక మేరకు సీసీ రోడ్డు రాత్రికి రాత్రే వెలిసింది. ఇదే కాలనీ పక్కనే ఉన్న మరో ప్రాంతంలో బిటి రోడ్లు వేయడం జరిగింది. ఎన్నికల సమయంలో అభివృద్ధి పనులు జరుగుతుండడం పట్ల ప్రజలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాలుగా కాని పనులు చకా చకా జరగడం పట్ల విస్మయం చెందుతున్నారు. పార్టీల అభ్యర్థులు ఎక్కడికి వెళ్ళినా ప్రజలు సీసీ కెమెరాలు కావాలని కోరుతున్నారు. డన్ అంటూ రెండు మూడు రోజులకే వారి కోరికలు తీరు పోతున్నాయి. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో లొంగి ఉంటారని ఏది అడిగినా ఇట్టే చేస్తారని గట్టిగా నమ్ముతున్న ప్రజలు తమ కోరికల చిట్టాను వారి ముందు ఉంచుతున్నారు. కాలనీలోని పార్కులులో పిల్లలు ఆట వస్తువులు వచ్చి చేరి పోతున్నాయి. యువతకు కావాల్సిన స్పోర్ట్స్ కిట్‌లు వారికి అందుతున్నాయి. బస్తీ వాసులకు మొదటి దశ లక్ష్మీ వారి దరికి చేరుతోంది. ఇక ప్రధాన పార్టీల క్యాడర్‌లో పండుగ వాతావరణం కనపడుతోంది. నియోజకవర్గంలో అధికార పార్టీ బిఆర్ఎస్ హంగూ ఆర్భాటం ఎక్కువగా ఉంది. క్యాడర్‌లో జోష్ కనపడుతోంది. . ప్రజల కోరికలను వారు తమ నాయకులకు వివరిస్తున్నారు. ప్రచారం నుంచి అన్నింటిలోనూ అధికార పార్టీ దూకుడు నేడు కనిపిస్తోంది. కాంగ్రెస్ హడావిడి లేకుండా వ్యూహాత్మకంగా అంతర్గత సమావేశాలుతో ఓటర్లును మచ్చిక చేసుకుంటోంది. బిజెపి ప్రచార శైలి రెండు పార్టీలకు భిన్నంగా సాగుతోంది. నియోజకవర్గంలో పార్టీకి ఉన్న బలమైన ఓటు బ్యాంకును కాపాడుకుంటూనే తటస్థులను తమ వైపుకు తిప్పుకునే పనిలో నిమగ్నమై ఉంది. మరో తొమ్మిది రోజులులో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్లుకు మరిన్ని తాయిలాలు అందించేందుకు పార్టీలు సర్వదా సిద్దంగా ఉన్నాయి.

## తెలంగాణ అభివృద్ధి కోసం పాటుపడిన మహానేతను చూసి ఓటేయండి

**ఫతేనగర్ ప్రజా ఆశీర్వాద యాత్రలో మాధవరం కృష్ణారావు**



ప్రచారంలో పాల్గొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 20, ప్రభాతవార్త : స్వరాష్ట్రం కోసం పోరాడి తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి బాటలో నడిపించిన మహానేత కెసిఆర్‌ను చూసి ప్రజలు ఓటు వేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. కూకట్‌పల్లి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావు ఫతేనగర్‌లోని పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి సోమవారం ప్రజా ఆశీర్వాద ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పదేళ్ళ కాలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమానలు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా పాదయాత్రలో మహిళలు అడుగడుగునా మంగళ హారతులతో నీరాజనాలు పలికారు. ఈ నేపథ్యంలో మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఒకప్పుడు ఫతేనగర్‌లో మంచినీళ్ళు లేక డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉంటూ వర్షం వస్తే రోడ్డు బురదమయం అయ్యేవని కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిందని, 400 కోట్ల రూపాయలతో ఎస్టిపి ప్లాంట్ నిర్మాణం, గల్లీ గల్లీకి సీసీ రోడ్డు, 24 గంటలు విద్యుత్ అందించి అత్యధికంగా కార్మికులు నివసించే ఫతేనగర్‌లో నేడు పూర్థిస్థాయిలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని తెలిపారు. 60ఏళ్ళుగ కానీ ఈ పనులు కేవలం 10ఏళ్ళలో ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్ సహాయ సహకారాలతో చేసి చూపించామని నేడు కాంగ్రెస్ పార్టీ పలుకుతున్న ప్రగల్బాలు ప్రజలు నమ్మవద్దని గతంలో కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కోతలతో పరిశ్రమలు, రైతులు అల్లాడిపోయేవారని నేడు కర్ణాటక రాష్ట్రంలో జరుగుతున్న దుస్థితి మళ్ళీ తెలంగాణ రాష్ట్రంలో తెచ్చుకో వద్దని పిలుపునిచ్చారు. అభివృద్ధికే ఓటు వేయాలని రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను అఖండ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వాన్ని బలపరుద్దామని తెలిపారు.

## సీనియర్ జర్నలిస్టు ఆత్మహత్య

**నివాళ్ళర్పించిన పలువురు ప్రముఖులు**



జర్నలిస్ట్ నర్సింగ్‌రావు భౌతిక కాయంకు నివాళులర్పిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

ముషీరాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎర్రం నర్సింగ్ రావు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుఝామున మూడు గంటల ప్రాంతంలో ఇంట్లో అందరూ నిద్ర పోతుండగా బయటకు వచ్చిన ఆయన బయట మెట్లకు ఉన్న రైలింగ్‌కు చీరతో ఉరి వేసుకున్నారు. కుటుంబ సభ్యులు గమనించే సరికే ఆయన మృతి చెందటంతో గాంధీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీకి తరలించి, అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. గత మూడు సంవత్సరాలుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారని, దీనికి తోడు ఆర్థిక సమస్యలు కూడా వెంటాడుతూ ఉండటంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఆయన కుమారుడు పవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. నర్సింగ్‌రావ్ భౌతిక కాయానికి మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, బీజేపీ అభ్యర్థి పూస రాజు, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ, టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, గ్రేటర్ అధ్యక్షులు ఎం.నర్సయ్య, కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, బిసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, టీడీపీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు పి.సాయిబాబా, బీఆర్ ఎస్ నాయకులు వి.శ్రీనివాసరెడ్డి, ముఠా జైసింహ, బీజేపీ నాయకులు ఏ.వినయ్‌కుమార్, వెంకటేష్, పీఓడబ్ల్యూ మహిళా నేత సంధ్య, సజయ, తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

## నిత్య అభ్యాసం ద్వారానే విద్యార్థులకు పురోగతి

**నల్సార్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకృష్ణదేవరావు**




చిక్కడపల్లి, నవంబరు 20 ప్రభాతవార్త: నిత్య అభ్యాసం ద్వారానే విద్యార్థులు పురోగతి సాధించే అవకాశం ఉంటుందని నల్సార్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకృష్ణదేవరావు అన్నారు. చిక్కడపల్లిలోని పెండేకంటి న్యాయ కళాశాల ఆధ్వర్యంలో 'కార్పొరేట్-వాణిజ్య చట్టాలు-ధోరణులు సాంకేతికతల గతిశీలత' అంశంపై జరుగుతున్న జాతీయ సదస్సు ముగింపు సభ జరిగింది. సదస్సుకు ముఖ్యఅతిథిగా ప్రొఫెస్ శ్రీకృష్ణదేవరావు హాజరై ప్రసంగించారు. కార్పొరేట్, వాణిజ్య చట్టాలపై అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని చెబుతూ కార్పొరేట్ రంగంలో వచ్చిన మార్పులను, చెందిన అభివృద్ధి గురించి వివరించారు. గౌరవ అతిథిగా హాజరైన ఉస్మానియా విశ్వవిద్యాలయం లా పీజీ కళాశాల ప్రిన్సిపాల్, లా విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమకాలీన, ఆచారణాత్మకమైన కృషితోనే సమాజం పురోగతి చెందుతుందని అన్నారు. విద్యార్థులు తమ వంతు కృషి చేయాలన్నారు. వాసవీ అకాడమి ఆఫ్ ఎడ్యుకేషన్ కోశాధికారి ఎం.వి.పార్థసారథి మాట్లాడుతూ జాతీయ సదస్సు ప్రాముఖ్యతను జరిగిన అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.అరవింద, వివిధ రంగాలకు చెందిన వారిని, కళాశాల ప్రతినిధులు, నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అడ్డగుట్టలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్

## అడ్డగుట్టను ఆదర్శంగా తీర్చిదిద్దుతా : పద్మారావు గౌడ్

అడ్డగుట్ట, నవంబర్ 20 ప్రభాతవార్త: దక్షిణ భారత దేశంలో అతి పెద్ద మురికివాడగా పేరొందిన అడ్డగుట్టను అబివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దిన ఘనత తమకే దక్కిందని సికింద్రాబాద్ బిఆర్ఎస్ అభ్యర్థి డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావు గౌడ్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్‌తో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ అసెంబ్లీని కనీ, వినీ ఎరుగని రీతిలో అబివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ పాదయాత్రలో ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో అపూర్వ స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రామేశ్వర్ గౌడ్, లింగాని శ్రీనివాస్, నక్క మధు, వసంత, వడ్డెర ఎల్లయ్య, మోహన్, ఇస్మయిల్ తదితరులు పాల్గొన్నారు.

**పద్మారావు గౌడ్ గెలుపు కోసం తనయుడు రామేశ్వర్ గౌడ్ ప్రచారం**

**తార్నాక..** ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపుకోసం ఆయన కుమారుడు రామేశ్వర్ గౌడ్ విస్తృతంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తూ పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బీఆర్ఎస్ నగర సంయుక్త కార్యదర్శి తెలంగాణ పెద్దన్న రాజేష్ గౌడ్, నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బీఆర్ఎస్ అభివృద్దిని చూసి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాజేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల ఆదరణ చూస్తుంటే పజ్జన్న విజయం ఖాయమనే విధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.ఆర్.కృష్ణ,ఎ.ప్రకాష్,గోవిందన్,వేణుగోపాల్ రెడ్డి, వెంకటేశ్వర రావు, పరుశురాంతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సుధీర్‌రెడ్డిని చిత్తుగా ఓడిస్తాం: ఇండిపెండెంట్లు

సైఫాబాద్, నవంబరు 20 ప్రభాతవార్త: అవినీతి పరుడు, భూకబ్జాదారుడు, ప్రజల సమస్యలను పట్టించుకొని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని ఎల్‌బి నగర్ నియోజకవర్గం ఇండిపెండెంట్ అభ్యర్థుల ఫోరం హెచ్చరించింది. ఈ నియోజకవర్గం నుంచి 48 మంది అభ్యర్థులు ఇండిపెండెంట్‌లుగా పోటిచేస్తున్నారని, అందరూ ఒకే తాటిపైకి వచ్చి సుధీర్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం ప్రతినిధులు మంచాల శ్రీకాంత్, శ్రీనివాస్, జోత్స్నరాణి, షణ్ముఖచారి, సోమయాజులు, బాలకిర్తిరాణి తదితరులు మాట్లాడుతూ సుధీర్‌రెడ్డి సొంత ప్రయోజనాలే తప్పా ప్రజల బాగోగుల గురించి పట్టించుకోలేదని, సమస్యల పుట్టగా నియోజకవర్గం ఉందన్నారు. 90 శాతం రోడ్లన్ని గుంతలు, గతుకులతో ఉన్నాయని, డ్రైనేజి, మంచినీరు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారని వారు ఆరోపించారు. సుధీర్‌రెడ్డిని ఓడించేందుకు ఒక మంచి అభ్యర్థిని ఎన్నుకుని త్వరలోనే ప్రకటన చేస్తామన్నారు. అధికార యంత్రాంగం మొత్తం సుధీర్‌రెడ్డి కొమ్ముకాస్తున్నదని, తమకు అన్ని విషయాల్లో అన్యాయం చేస్తున్నదని వారు ధ్వజమెత్తారు.

## ఈ ఎన్నికల్లో కెసిఆర్, కెటిఆర్‌ను బొంద పెట్టాలి

సైఫాబాద్, నవంబరు 20 ప్రభాతవార్త: గత 9 సంవత్సరాలుగా ఇంజనీరింగ్ విద్యార్థులకు తీవ్రంగా అన్యాయం చేసిన సిఎం కెసిఆర్, రాష్ట్ర మంత్రి కెటిఆర్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో బొందపెట్టాలని తెలంగాణ ఇంజనీరింగ్ స్టూడెంట్ జాయింట్ యాక్షన్ కమిటి విద్యార్థులకు పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ అధ్యక్షుడు రాయచూర్ శరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గుండ్ల కార్తిక్ తదితరులు మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ 35 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచాలని, స్కాలర్‌షిప్‌లు 3 వేల నుంచి 5 వేలకు పెంచాలని, టెక్నికల్ ట్రైనీంగ్ పెంచాలని, బిటెక్ చదివిన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఉద్యోగాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్లపై పలు మార్లు కెసిఆర్, కెటిఆర్‌కు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని, దీంతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. కెటిఆర్ ఉద్యోగాలు ఇవ్వలేక రోజుకొకమాట చెప్పి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. అందువల్లనే విద్యార్థులు ఐక్యంగా బిఆర్ఎస్ పార్టీని చిత్తుగా ఓడించాలని వారు పిలుపునిచ్చారు.

## ఘనంగా కార్తీక వనభోజనం మహోత్సవం



మధురానగర్‌లో శివపార్వతుల కల్యాణం సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, శివరామకృష్ణ వరప్రసాద్

యూసుఫ్‌గూడ, నవంబర్ 20, ప్రభాతవార్త : వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ బి బ్లాక్‌లో శ్రీకాంత్ రెడ్డి శివరామకృష్ణ వరప్రసాద్ ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం మహోత్సవం, శివపార్వతుల కళ్యాణం, సత్యనారయణ స్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో డివిజన్ కార్పోరేటర్ దేదిప్య విజయ్ కుమార్‌లు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున వనభోజనాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, సాయిరఘు, రాముకుమార్, జిటియస్ దేవాలయం చైర్మన్ చిన్నరమేష్, దేవిరింటి నాగార్జున రెడ్డి, శ్యామ్‌రావు ముదిరాజ్, బాలశౌరి, అర్జున్, సుశీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**ముదిగొండ శివప్రసాద్ రచించిన 'స్కంద గీత' గ్రంథావిష్కరణ**

చిక్కడపల్లి, నవంబరు 20 ప్రభాతవార్త: చారిత్రక నవలాచక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్ రచించిన 'స్కంద గీత' గ్రంథావిష్కరణ సభ వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో జరిగింది. సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈ గ్రంథాన్ని ప్రముఖ సంపాదకులు ఎంవిఆర్.శాస్త్రి ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. కందకుర్తి చరిత్రను స్కందగీతగా రచించి, నేటితరాలకు అందించడం ముదావాహం అని అన్నారు. ప్రతి రచయిత వివిధ ప్రాంతాల స్థితిగతులను చరిత్రను అధ్యయనం చేసి గ్రంథాలు రచించాలని అన్నారు.

# నాగోల్ టు పెద్ద అంబర్‌పేటకు మెట్రోను విస్తరిస్తాం

## అధికారంలోకి అంతర్జాతీయ ప్రమాణాలతో ఎల్‌బినగర్ అభివృద్ధి

## మోసపూరిత హామీలను ప్రజలు నమ్మవద్దు : రోడ్ షోలో కెటిఆర్



రోడ్ షో కార్యక్రమంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి కెటిఆర్



రోడ్ షో కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కెటిఆర్, చిత్రంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి, ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ తదితరులు

**మన్సూరాబాద్, నవంబర్ 16 ప్రభాతవార్త:** ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్ ఎల్.బి.నగర్ నియోజకవర్గం లోని మన్సూరాబాద్ చౌరస్తాలో సోమవారం రాత్రి బిఆర్ఎస్ అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కెటిఆర్ మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ఉన్న దీర్ఘకాలిక సమస్యలను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరిష్కారం చేయడం జరిగిందని తెలిపారు. మరోసారి సుధీర్‌రెడ్డిని ఆశీర్వదించి గెలిపిస్తే రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తారని, అదేవిధంగా నాగోల్ వరకు ఉన్న మెట్రోను ఎల్‌బినగర్ మీదుగా పెద్ద అంబర్‌పేటకు విస్తరించేబాధ్యత తమదేనని స్పష్టమైన హామీనిచ్చారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సుధీర్‌రెడ్డిని గెలిపిస్తే సమస్యలు నియోజకవర్గంగా తీర్చిదిద్దుతారని తెలిపారు. గత జిహెచ్ఎంసి ఎన్నికలలో ప్రజలు తప్పటడుగు వేసి బిజెపికి ఓట్లు వేసారని, ఈ సారి అలా మోస పోవద్దన్నారు. నియోజకవర్గంలో 118 జిఒ ద్వారా కొన్ని వేల కుటుంబాలకు శాశ్వత పరిష్కారం కలిపించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ఎల్.బి. నగర్ నియోజకవర్గన్నీ వేల కోట్ల రూపాయల నిధులతో ఎంతో అభివృద్ధి చేసామని తెలిపారు. మరికొన్నీ చోట్ల అక్కడకక్కడ కొన్ని సమస్యలున్నాయని వాటిని కూడా ప్రణాళికబద్ధంగా పూర్తి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఎల్బీనగర్ చౌరస్తా, నాగోల్, బైరామల్‌గూడ తదితర ప్రాంతాలలో ఫ్లైఓవర్లు నిర్మించి ఫ్రీ సిగ్నల్ చౌరస్తాగా మార్చి ట్రాఫిక్ కష్టాలను తీర్చడం జరిగిందన్నారు. టిఎస్‌పిఎస్సీ పూర్తిగా ప్రక్షాళనచేస్తామని ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌ను పక్కాగా ప్రకటించి యువకలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, టిఎస్‌పిఎస్సీలో జవాబుదారితనాన్ని పెంచుతామన్నారు. కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ స్థలంలో 1200కోట్ల రూపాయలవ్యయంతో 1000 పడకలతో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తు న్నామని మంత్రి కెటిఆర్ తెలిపారు. ఎమ్మెల్యేగా సుధీర్‌రెడ్డిని గెలిపిస్తే ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో మెరుగైన సదుపాయా లు కల్పిస్తామని ఆయన తెలిపారు. అనంతరం ఎల్‌బినగర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి వేల కోట్ల రూపాయలు ఇచ్చిన ఘనత మంత్రి కెటిఆర్‌దేనని, నియోజకవర్గంలో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, వరద ముంపు, 118 జిఒ ద్వారా కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. ఎల్‌బినగర్ గడ్డమీద గులాబీ జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బినగర్‌నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంఛార్జి ముద్దగౌని రామ్మో హన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, జక్కిడి రఘువీర్‌రెడ్డి, అనంతుల రాజిరెడ్డి, మామిడి రాంచందర్, బండారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌తోనే ఉప్పల్ అభివృద్ధి సాధ్యం : బండారి లక్ష్మారెడ్డి



చట్‌పూజలో పాల్గొన్న బండారి లక్ష్మారెడ్డి, బొంతు శ్రీదేవి తదితరులు



ప్రచారంలో పాల్గొన్న బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, నాచారం, నవంబర్ 20 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీతోనే ఉప్పల్ అభివృద్ధి సాధ్యమవుతుందని బిఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ నియోజకవర్గం పరిధి లోని ఉప్పల్, నాచారం, చర్లపల్లి తదితర ప్రాంతాల్లో కాలనీలలో పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. చర్లపల్లి, ఉప్పల్ బతుకమ్మ ఘాట్‌ల వద్ద మార్వాడీలు ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే చట్ పూజ కార్యక్రమంలో పాల్గొని వారిని ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందని, పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో ప్రతి ఒక్కరికి చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు మరోసారి పట్టం గడుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా పలువురు పార్టీ నేతలు బిఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**చట్‌పూజ కార్యక్రమంలో బిఎల్ఆర్ :** ఉప్పల్, చరపల్లిలో జరిగిన మార్వాడీల చట్‌పూజ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. చర్లపల్లి బతుకమ్మ ఘాట్‌లో స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, పలువురు పార్టీ నేతలతో కలిసి పూజలు నిర్వహించారు. ఉప్పల్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డితోపాటు, బీహార్ అసోసియేషన్ కార్యదర్శి ప్రభాస్‌కుమార్, రవిశంకర్‌సింగ్, పాఠక్, సూర్యశేఖర్‌సింగ్, పలువురు సంఘం నేతలు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీహారీలు ప్రతి ఏటా చట్‌పూజ నిర్వహిస్తారని, పురాతన హిందు వేద పండుగ అన్నారు. మహిళలు, స్థానికులు నది ఒడ్డున ఉండి సూర్య భగవానుడిని పూజించడం అనవాయితీగా వస్తుందని, వారికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఉత్తారాది రాష్ట్రాలకు చెందిన పలువురు మార్వాడీలు సంప్రదాయాలతో ఉత్సవాలు వైభవంగా చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు అన్య బాలకృష్ణ, సుక్క కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్దులు, వికలాంగులు ఓటు సద్వినియోగం చేసుకోవాలి: పంకజ

**ఎల్‌బినగర్, నవంబరు 20 ప్రభాతవార్త:** వృద్ధులు, వికలాంగులు తమ అమూల్యమైన ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఎల్బీనగర్ ఎన్నికల రిటర్నింగ్‌అధికారి పంకజ సూచించారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో 80 సంవత్సరాలు దాటిన వృదులు, వికలాంగులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఫామ్ 12డి సమర్పించిన వారికి హోం ఓటింగ్ ఈనెల 20, 21వ తేదీలలో నిర్వహిస్తున్నమని తెలిపారు. 2రోజులపాటు ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని వృద్ధులు వికలాంగులు తమ ఓటు హక్కును ఫామ్ 12డి సమర్పించిన వారికి హోం ఓటింగ్ ప్రక్రియ గురించి సరూర్‌నగర్ ఇన్‌డోర్ స్టేడియంలో 21 బృందాల సభ్యులతో రిటర్నింగ్ అధికారి పంకజ సోమవారం సంక్ష సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వో రవీందర్‌కుమార్, ఆర్ఓ సునీత, నోడల్ అధికారి డి.రణజిత్, డిటి నరేష్ కుమార్, సెక్టోరల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, పోలీస్ అధికారులు, వీడియో గ్రాఫ్లు, మైక్రో ఆబ్సర్వర్లు, ఎన్నికల సిబ్బంధి పాల్గొన్నారు.

**పోలింగ్ కేంద్రాల పరిశీలన...** ఎల్బీనగర్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు పరిశీలించారు. జనరల్ ఆబ్సర్వర్ రామ్‌కుమార్ సథురప్పన్, ఎల్బీనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్. పంకజ నియోజకవర్గంలోని బండ్లగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మల్లికార్జున్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

# ప్రజల మద్దతు కాంగ్రెస్‌కే : మలక్‌పేట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మధుయాష్కీ



మల్లారపు శాలినికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మధుయాష్కీగౌడ్

**సైదాబాద్, నవంబర్ 20 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు ఉందని ఎల్‌బినగర్ నియోజకవర్గం అభ్యర్థి మధుయాష్కీ అన్నారు. మాజీ కౌన్సిలర్ మల్లారపు శాలిని సోమవార ం మధుయాష్కీ సమక్ష ంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి సిపిఐ, తెలంగాణా జనసమితితో పాటు ప్రజల మద్దతు ఉందన్నారు. ఎల్‌బినగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. అనంతరం మల్లారపు శాలిని మాట్లాడుతూ చదువుకున్న వ్యక్తి, బీసీ బిడ్డ అందర్నీ కలుపుకుపోయే వ్యక్తి అయిన మధుయాష్కీగౌడ్‌కు తన పూర్తి సహకారం అందిస్తానని, నా ఆత్మగౌరవం కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని అన్నారు. గడచిన పదేళ్ళ బిఆర్ఎస్ పాలన పట్ల ప్రజలు విసిగిచెంది ఉన్నారనీ సిఎం కెసిఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబపాలనకు చరమగీతం పాడాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌బినగర్ నియోజకవర్గంలో ఈ సారి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇంఛార్జిలు మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, శ్రీను, యోగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**చంపాపేటలో పాదయాత్ర...** చంపాపేట డివిజన్ శుభోదయ కాలనీలో కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ పాదయాత్ర నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, నియోజకవర్గం ఇంఛార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎల్లమ్మ దేవాలయ ప్రతిష్ట ధార్మిక చింతనతో లోక కళ్యాణం



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని పూజారులు, కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**కుషాయిగూడ, నవంబర్ 20 ప్రభాతవార్త :** కాప్రా డివిజన్ కమల నెహ్రూనగర్ కందిగూడాలోని అతి పురాతన ఆలయంలో శ్రీ మహంకాళి నల్లపోచమ్మ రేణుకఎల్లమ్మ దేవాలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది ఆదివారం కార్తీక మాసం శ్రవణా నక్షత్రం సందర్భంగా నిర్వహించిన ఈ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. 35 అడుగుల రాతి ధ్వజస్తంభమ్, బొడ్డు రాయి ఏర్పాట్లు చేశారు ఈ ప్రత్యేక కార్యక్రమాలలో బ్రహ్మజ్ఞాన యోగా నిర్వాహన కేంద్ర నిర్వాహకులు సూర్యనారాయణమూర్తి పూజ గురుదేవ హనుమాన్ దీక్షితులు శ్రీనివాస స్వామి పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్టాపనల అనంతరం పూర్ణాహుతి గ్రామదేవతల తమిళ సాంప్రదాయ ప్రకారం ఆలయ ఆగమన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పుణ్య దంపతులు గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి : జోత్స్నప్రభ

**హయత్‌నగర్, నవంబర్ 20 ప్రభాతవార్త :** విద్యార్థులు కళాశాల పుస్తకాలే కాకుండా విలువైన గ్రంథాలను ఉపయోగించుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జోత్స్నప్రభ అన్నారు. కళాశాలలో సోమవారం కళాశాల గ్రంథాలయం ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ, చరిత్ర, ఆర్థిక, సామాజిక, భాషా సాహిత్య అంశాలకు సంబంధించిన పుస్తకాలను విదార్థులు చదివి వాటిలోని సారాంశాలను ఒంట బట్టించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంధపాలకుడు అమరేందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, డా.సుబ్రమణ్యం, సురేష్, రవీందర్, నరేందర్‌రెడ్డి, గ్రంధపాల సహాయకుడు మురళీమోహన్ పాల్గొన్నారు.

# ముస్లిం మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చా.. నా సేవలను గుర్తించండి: బిఆర్ఎస్ అభ్యర్థి సబితాఇంద్రారెడ్డి



పహడీలో సబితారెడ్డిని ఆశీర్వదిస్తున్న దర్గా ముజావర్‌లు



ప్రచారంలో ప్రసంగిస్తున్న యువ నేత కార్తీక్‌రెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 20 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో మైనారిటీల సంక్షేమానికి చాలా ప్రాధాన్యతనిచ్చా.. ఎన్నో అభివృద్ధి పనులు జరిపించి ప్రభుత్వం నుండి సంక్షేమ ఫలాలు అందించా.. తన సేవలను గుర్తించి ఈ ఎన్నికల్లో మద్దతు ఇచ్చి గెలిపించాలని నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి ముస్లిం మైనారిటీలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె తన కుమారులు బిఆర్ఎస్ జాతీయ మీడియా స్పోక్స్ పర్సన్ పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డి, యువ నేత కౌశిక్‌రెడ్డిలతో కలిసి జల్‌పల్లి మున్సిపాలిటీలోని పహాడీషరీఫ్‌లో భారీ రోడ్ షో నిర్వహించారు. రోడ్ షోకు ముందు చారిత్రక పహాడీ హజ్రత్ షర్ఫుద్దీన్ దర్గా ముజావర్‌ల ఆశీర్వాదం తీసుకొన్నారు. అనంతరం ఆమె ముస్లిం ముఖ్య నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ కొత్తగా మహేశ్వరం నియోజవర్గం ఏర్పడిన నాటి నుండి తాను ఇక్కడి ప్రాంతాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానని వెల్లడించారు. పహాడీషరీఫ్ దర్గాకు వచ్చే వారికి ఇబ్బంది లేకుండా రోడ్లు, షెడ్లు ఏర్పాటు చేయించడంతో పాటు దర్గా పైకి సులభంగా వెళ్ళడానికి రూ.14 కోట్లతో ర్యాంపు రహదారిని నిర్మించామన్నారు. జల్‌పల్లి మునిసిపాలిటీ కిందకు వచ్చే ముస్లిం బస్తీలు, కాలనీల్లో ప్రజలకు మౌళిక సదుపాయాలను కల్పించడంతో పాటు ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయించానని గుర్తు చేశారు. వందలాది మందికి సిఎం కెసిఆర్ అమలు చేసిన షాదీ ముబారక్ పథకంకింద ఆడపిల్లల పెళ్ళిలకు లక్ష రూపాయలు మంజూరు చేయించానని ఆమె వివరించారు. అంతే కాకుండా వరద ముంపు సమస్యలను తీర్చి జల్‌పల్లి పెద్ద చెరువును సుందరీకరించే పనులు చేపట్టామని తెలిపారు. కనీవినీ ఎరగని రీతితో జల్‌పల్లి మున్సిపాలిటీలో భారీ ఎత్తున నిధులతో అభివృద్ధి చేశామన్నారు. తనచొరవవల్లే ఇక్కడి ముస్లిం మైనారిటీలకు మిషన్ భగీరథ ట్యాంకుల నిర్మాణం జరిగి తాగడానికి కృష్ణా నీరు సరఫరా అవుతున్నదని ఆమె తెలిపారు.

**మభ్యపెట్టే వారికి ఓటు ద్వారా బుద్ధి చెప్పండి: కార్తీక్‌రెడ్డి...** ఇక్కడి ప్రాంతాలపై అవగాహన లేకుండా కొత్తగా వచ్చి మభ్యపెట్టే వారిని విశ్వసించవద్దని బిఆర్ఎస్ జాతీయ మీడియా స్పోక్స్‌పర్సన్ కార్తీక్‌రెడ్డి ముస్లిం మైనారిటీ ఓటర్లను కోరారు. ప్రచారంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత రూపురేఖలు, సరిహద్దులు తెలియనివారు పోటీలో ఉన్నారనీ వారిని విశ్వసించవద్దన్నారు. ముస్లింలను ఓటు బ్యాంకుగా చూస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలనీ కాంగ్రెస్ 6 గ్యారంటీల్లో మైనారిటీల ప్రస్తావనే లేదని, గత ఐదేళ్ళుగా మీతో మమేకమై సేవలు అందించిన సబితా ఇంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధి, సంక్షేమాలను కొనసాగించుకోవాలని ఆయన తెలిపారు.

# స్వచ్ఛమైన పాలన అందించే బిజెపికే పట్టం కట్టండి : అందెల శ్రీరాములుయాదవ్




రోడ్ షో ప్రచారం చేస్తున్న బిజెపి అభ్యర్థి అందెల: చిత్రంలో బొక్క నర్సింహారెడ్డి, శంకర్‌రెడ్డి, సబితా రాజశేఖర్‌రెడ్డిలు

**సరూర్‌నగర్, నవంబర్ 20 ప్రభాతవార్త:** స్వచ్ఛమైన పాలనను అందించే బిజెపికే ప్రజలు పట్టం కట్టాలని మహేశ్వరం నియోజకవర్గ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విస్తృతంగా పర్యటించి రోడ్‌షోలు, పాదయాత్రల ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు పాల్పడే బిఆర్ఎస్ ప్రభుత్వంపై ఈ ఎన్నికల్లో ప్రజలకు విశ్వాసం లేదన్నారు. పాలకులపై ప్రజలకు నమ్మకం పోయిందని ఆయన తెలిపారు. పెరిగిన ఇంటి పన్నులతో ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు. నేరాలు, ఘోరాలు జరుగుతున్నా బాధితులకు ఎలాంటి న్యాయం జరగడం లేదని ఆయన ఆరోపించారు. ప్రతి అభివృద్ధి పనిలో అవినీతిఉంటున్నదనీ, సుందరీకరణపేరిట ఆక్రమణలు చేశారని ఆయన విమర్శించారు. ఈ సారి ప్రజలు మార్పు తేవాలని ఆయన కోరారు. ఈ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని అందెల విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెండ్యాల నర్సింహ, కీసర గోవర్థన్‌రెడ్డి, మద్ది సబితా రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సిద్దాల దశరథ, వివిధడివిజన్ల కార్పొరేటర్లతో పాటు గాజుల మధు, కోదూరు సోమేశ్వర్, సూల ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సేవ చేయాలని వచ్చాను... నన్ను విశ్వసించండి : కెఎల్ఆర్



బాలాపూర్ కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కెఎల్ఆర్




మీర్‌పేట్ రోడ్ షో ద్వారా ప్రచారం చేస్తున్న కెఎల్ఆర్

**సరూర్‌నగర్, నవంబర్ 20 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గానికి సేవ చేయాలని వచ్చా.. నన్ను విశ్వసించి ఈ ఎన్నికల్లో తనకు ఓటు వేయాలని కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన నియోజకవర్గంలోని మీర్‌పేట్, బాలాపూర్, మహేశ్వరం తదితర ప్రాంతాల్లో రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు, పాదయాత్రలు నిర్వహించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కెఎల్ఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని అన్నారు. గత పదేళ్ళ బిఆర్ఎస్ పాలనపై ప్రజలకు విరక్తి కలుగుతున్నదనీ ఈ నేపథ్యంలో ఆరు గ్యారంటీలతో ముందుకు వచ్చిన కాంగ్రెస్‌కు పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి సేవకునిగా వచ్చిన తనను ఆదరించాలని ఆయన కోరారు. సోనియా ప్రకటించిన ఆరు గ్యారంటీలు ఇక్కడి ప్రజలకు అందేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కెఎల్ఆర్ ప్రచార కార్యక్రమాల్లో డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, మీర్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డిలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ సంక్షేమ పథకాలే గెలుపుకు దోహదపడతాయి : మమత రాజశేఖర్‌రెడ్డి



నఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి సతీమణి మమత

**మల్కాజిగిరి, నవంబర్ 20 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మల్కాజిగిరిలో మర్రి రాజశేఖర్‌రెడ్డి గెలుపుకు దోహదపడతాయని మల్కాజిగిరి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి సతీమణి మర్రి మమత రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని మిర్జాలగూడ, రాజానగర్, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాలలో ఆమె స్థానిక కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్, మల్కాజిగిరి సర్కిల్ ఎన్నికల ఇంచార్జి జితేందర్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మల్కాజిగిరి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటు వేసి రాజశేఖర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్, గౌతమ్‌నగర్ డివిజన్ ఇంచార్జ్ నరసింహయాదవ్, బిక్షపతి, మల్లేష్‌ముదిరాజ్, మల్లేష్‌యాదవ్, బైరు అనిల్, భాగ్యవతి, అనిత, లీల, బాచి, లక్ష్మణ్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజెపిని గెలిపిస్తే వరద, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం : సామ రంగారెడ్డి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సామ రంగారెడ్డి తదితరులు

**వనస్థలిపురం, నవంబర్ 20 ప్రభాతవార్త :** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన బిజెపి పార్టీ అభ్యర్థినైన తనను గెలిపించాలని ఎల్‌బినగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డి కోరారు. సోమవారం వనస్థలిపురం, మన్సూరాబాద్, చైతన్యపురి డివిజన్‌లలో కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కొప్పుల నర్సింహ్మారెడ్డి, రంగా నర్సింహ్మగుప్తలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసేవ చేయాలనే దృఢ సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చిన తాను గత 16 సంత్సరాలుగా నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకున్నానన్నారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించిన బీజేపీ కావాలా అని ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. బీజేపీని గెలిపిస్తే ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలో వరద నీరు, డ్రైనేజి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తుందన్నారు. అదే విధంగా మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డితో కలసి సామ రంగారెడ్డి పాదయాత్ర చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మహిళలు సామ రంగారెడ్డికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. చైతన్యపురి డివిజన్‌లో చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ్మగుప్తతో కలసి సామ రంగారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ అధికారంలోకి వస్తే రదనీరు, డ్రైనేజి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, నాయిని శ్రీకాంత్ రెడ్డి, నూతి శ్రీనివాస్, కాటం క్రాంతిగౌడ్, అంజన్‌కుమార్‌గౌడ్, తడకమళ్ల విజయ్, రాథోడ్, విజయ కాలనీ అధ్యక్షులు భూపతిరెడ్డి, సతీష్‌గౌడ్, నవీన్, మోహన్‌రెడ్డి, హరీందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నాదర్‌గుల్‌లో సహకార వారోత్సవాలు



సహకార జెండా ఎగురవేస్తున్న ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 20 ప్రభాతవార్త:** నాదర్‌గుల్‌లో సోమవారం సహకార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో భవనం ఎదుట జరిగిన కార్యక్రమంలో ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పాలిట వరం సహకార వ్యవస్థ అని అన్నారు. సహకారసంఘాల ద్వారా రైతుల సంక్షేమం జరుగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఛైర్మన్ పెత్తుల్ల పుల్లారెడ్డి, డైరెక్టర్లు పెద్దబావి మోహన్‌రెడ్డి, కందాడి జ్యోతి శ్రీనివాస్‌రెడ్డి, తోట ప్రతాప్‌రెడ్డి, రైతులు పెద్దబావి అంజిరెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, జెనిగె మల్లేష్, సొసైటీకి చెందిన సిబ్బంది సువర్ణ, కరుణాకర్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.